క్లుప్తంగా

యూటీఎఫ్ కొత్త కార్యవర్గం


సుదర్శన్


వాసుదేవరావు

దాచేపల్లి : యూటీఎఫ్ మండల శాఖ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి వట్టెపు నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా పి.సుదర్శన్, గౌరవ అధ్యక్షుడిగా పి.సత్యానంతరావు, ప్రధాన కార్యదర్శిగా టి.ఆనంద్‌కుమార్, అదనపు కార్యదర్శిగా ఎల్.వాసుదేవరావు, ఉపాధ్యక్షుడిగా ఎం.స్వాములు, కోశాధికారిగా వి.వెంకట్రావ్‌తోపాటుగా మహిళా కార్యవర్గ సభ్యులనూ ఎన్నుకున్నట్లు ఆయన వెల్లడించారు. కొత్త కమిటీ సభ్యులను యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వియసారథి, కోశాధికారి జేవీడీ నాయక్ తదితరులు అభినందించారు.

విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం విశేష అలంకరణ నిర్వహించారు. స్వామికి ముందుగా పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పలు రకాల పూలతో అలంకరించారు. స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి



మాచర్ల రూరల్: సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించి నిర్దిష్ట సమయంలో లబ్ధిదారులకు పథకాలు అందేలా పనిచేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కోటేశ్వరరావు కోరారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి, కొప్పునూరులోని గ్రామ సచివాలయాలను సందర్శించి ఎంపీడీఓ మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను సకాలంలో లబ్ధిదారులకు అందేలా ప్రతి ఉద్యోగి పనిచేయాలని, సిటిజన్ అవుట్ రీచ్ సర్వే, ఆయుష్మాన్ భారత్ సర్వేపై సమీక్ష నిర్వహించి పలు సూచనలందించారు. సచివాలయ ఉద్యోగులు యూనిఫాం తప్పనిసరిగా ధరించాలన్నారు. ఆయన వెంట కార్యదర్శులు సుజాత, శ్రీనివాసరావు, వీఆర్వోలు కాశి, జలీల్ ఉన్నారు.

వీధి బాలలకు దుస్తుల అందజేత



మాచర్ల: ప్రపంచ వీధిబాలల దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో వీధిబాలలు, వృద్ధులకు దుప్పట్లు, దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు, లోక్ అదాలత్ మెంబర్ మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. మంగళవారం ప్రపంచ వీధిబాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని నెహ్రూనగర్ ప్రాంతంలో అనాథ పిల్లలు, వృద్ధులకు మెజిస్ట్రేట్ ఆధ్వర్యంలో కొత్త దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ మధుబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ న్యాయం చేసేలా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యుడు మెట్టు గోవిందరెడ్డి, సీనియర్ న్యాయవాది గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సిటిజన్ ఔట్ రీచ్ సర్వే 87.22 శాతం పూర్తి

గురజాల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే 87.22 శాతం పూర్తయిందని ఎంపీడీఓ ఫణికుమార్ నాయక్ తెలిపారు. ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో సమావేశమై సచివాలయాల ద్వారా ప్రస్తుతం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ఉపాధి పనులు, సీఎంజేవై తదితర అంశాలపై ఏ కుటుంబానికి ఎంత మేరకు లబ్ధి చేకూరుతుంది అన్న విషయాలను వారికి తెలియజేస్తున్నట్లు చెప్పారు.

కరుణామయీ కానుకమాత

రెంటచింతల: కరుణామయీ కానుకమాత అని దాచేపల్లి విచారణ గురువులు ఫాదర్ యామర్తి సురేష్ చెప్పారు. స్థానిక కానుక మాత చర్చి 173వ తిరునాళ్లను పురస్కరించుకుని మంగళవారం విచారణ గురువులు ఏరువ లూర్దుమర్రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పునీత ఆరోగ్యనాథుని మందిరం వద్ద నవదిన ప్రార్థనలలో భాగంగా సమష్టి దివ్య పూజాబలి నిర్వహించారు. ఫాదర్ సురేష్ మాట్లాడుతూ క్రీస్తు సూక్తులు పాటించాలన్నారు.

జన సంక్షేమమే సర్కారు లక్ష్యం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి


చింతపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు

కారెంపూడి: జన సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు లక్ష్యమని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) చెప్పారు. మండలంలోని చింతపల్లిలో ఐదో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. బీసీ, ఎస్సీ కాలనీల్లో పీఆర్కే పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మూడేళ్లలో ప్రతి కుటుంబం పొందిన లబ్ధిని గురించి వివరించారు. బుక్‌లెట్లు అందించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కాలనీల్లోని ప్రజలు పీఆర్కేకు బ్రహ్మరథం పట్టారు. నుదట కుంకుమ దిద్ది, హారతులిచ్చారు. గుమ్మడి కాయతో దిష్టి తీశారు. ఆత్మీయ స్వాగతం పలికారు. ఇప్పటి వరకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై మహిళలు హర్షం వ్యక్తం చేశారు. పీఆర్కే మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటివరకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.11.66 కోట్ల మేర ప్రయోజనం చేకూర్చామని వివరించారు. సేద్యం, విద్య, వైద్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంటు జిల్లా కార్యదర్శి పంగులూరి రామకృష్ణయ్య, గ్రామ సర్పంచ్ ఉన్నం శ్రీనివాసరావు, ఎంపీటీసీ వేంపోగు నిర్మలఅచ్యుతరావు, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, ఉన్నం గిరి, గమిడి మల్లిఖార్జునరావు, ఉన్నం శివయ్య, శంకర్, కొటారు శివరామకృష్ణ, కర్నాటి సత్యనారాయణ, చిరుమామిళ్ల శేఖర్, మాగంటి అంకారావు, పంగులూరి కోటయ్య,గంటా వీరయ్య, కర్నాటి శివప్రసాద్,చిరుమామిళ్ల నరసింహారావు,బొట్లకుంట రామారావు, ఉమ్మినేని శివరామకృష్ణ, వసంత సాంబశివరావు, అలుగునూరి అమరయ్య, సూరె చెంచారావు, లంకా నాగేశ్వరరావు, సూరె వెంకటేశ్వర్లు, మోషయ్య, ఇర్మియా, వెంకయ్య, కారెంపూడి పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కొంగర సుబ్రమణ్యం, బొమ్మిన అల్లయ్య, కారెంపూడి సర్పంచ్ రమావతు ప్రమీలాభాయి తేజానాయక్ పాల్గొన్నారు.

మాచర్ల పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి

- మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి
- పురపాలకసంఘం సాధారణ సమావేశంలో 17 అంశాలకు ఆమోదం


మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి


మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబును సత్కరిస్తున్న దృశ్యం

మాచర్ల: పట్టణంలో ప్రతి వార్డునూ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి చెప్పారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సాధారణ సమావేశంలో పలు అంశాలకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశానికి బోయ రఘురామిరెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పట్టణ సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పర్యటనలో ఆయన దృష్టికి వచ్చిన సీసీ రోడ్లు, డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించినట్టు వెల్లడించారు. అనంతరం మొత్తం 17 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కౌన్సిలర్లు పోలా శ్రీను, మందా సంతోష్, మాచర్ల సుందరరావు, రామిశెట్టి వెంకటేశ్వర్లు, మాచర్ల చిన ఏసోబు, చవ్వా బాలస్వామిరెడ్డి అనిత, షేక్ కరిముల్లా, మస్తాన్, మదార్, సుభాని, తేరాల సిద్దయ్య, జగన్నాధం శివయ్య, చంద్రకుమార్, బత్తిన వేణు, ఆయా వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పురపాలక సంఘ కమిషనర్ ఈవీ రమణబాబును కార్యవర్గ సభ్యులు సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డిని కౌన్సిలర్లు సత్కరించి అభినందించారు.

మాచర్లలో నిరంతర నిఘా

- అరాచక శక్తులపై కఠిన చర్యలు
- అర్బన్ సీఐ బాలకృష్ణ



మాచర్ల: పట్టణంలో కొందరు రాత్రివేళల్లో హల్‌చల్ చేస్తూ చోరీలకు పాల్పడే యత్నంలో ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ సీఐ టి.బాలకృష్ణ కోరారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రెండు రోజులుగా పట్టణంలో చెడ్డీగ్యాంగ్ హల్‌చల్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని, ఇది అవాస్తవమని, ప్రజలు జాగ్రత్త ఉండి పోలీసులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని పేర్కొన్నారు. కొన్నిచోట్ల చోరీల యత్నాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. ఈ విషయంపై దృష్టిసారించి ఎక్కడికక్కడ కట్టుదిట్టంగా బందోబస్తును ఏర్పాటు చేసి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. చెడ్డీగ్యాంగ్ తిరుగుతుందనేది కేవలం ప్రచారం మాత్రమేనని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు. ఈ విషయంలో దుష్ప్రచారం చేసేవారిపై చర్యలు తప్పవన్నారు.

చోరీకి విఫలయత్నం

- చెడ్డీ గ్యాంగ్‌గా ప్రచారం
- కాదని తేల్చిన సీఐ బాలకృష్ణ

మాచర్ల : పట్టణంలోని సొసైటీ కాలనీలోని కిడ్స్ పాఠశాల సమీపంలో హేమశ్రీ అపార్టుమెంట్‌లోకి సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు చొరబడి సత్యనారాయణకు చెందిన ఫ్లాట్‌లో చోరీకి విఫలయత్నం చేశారు.ఎటువంటి నగదు, బంగారం దొరక్క పోవడంతో వారు వెనుదిరిగారు. దీనిని గమనించిన పలువురు పట్టణంలో చెడ్డీగ్యాంగ్ తిరుగుతుందంటూ ప్రచారం చేశారు. దీనిపై సీఐ బాలకృష్ణ వివరణ ఇచ్చారు. ఆ వ్యక్తులు చెడ్డీ గ్యాంగ్ కాదని, కొందరు కావాలనే సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని వివరించారు. పట్టణంలో నిఘా ను మరింత పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బంది కలిగినా తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. పట్టణంలో ఏ సమయంలోనైనా పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. అర్ధరాత్రి సమయంలో ఇబ్బంది కలిగితే 9440796240కు కాల్ చేయవచ్చని సూచించారు.

ఏడుగురు గుండాట నిర్వాహకుల అరెస్టు

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహా స్వామి తిరునాళ్ల సందర్భంగా ప్రధాన రహదారి పక్కన గుండాట నిర్వహిస్తున్న ఏడుగురు నిర్వాహకులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ కోటయ్య తెలిపారు. అక్రమంగా జూదం నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేయగా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.3,500 నగదు, ఫ్లెక్సీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కుష్ఠు రహిత సమాజం కోసం కృషి

గురజాల: కుష్ఠు రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని మాడుగుల వైద్యాధికారిణి పద్మావతి సూచించారు. మాడుగుల వైద్యశాలలో ఆమె మంగళవారం మాట్లాడుతూ గ్రామాల్లో వైద్యశాఖ ఆధ్వర్యంలో స్పర్శ-కుష్ఠుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కొన్ని ప్రాథమిక లక్షణాల ద్వారా వ్యాధిని ముందుగానే గుర్తించి వైద్యం పొందాలన్నారు. చర్మంపై స్పర్శలేని పాలిన, ఎరుపు రంగు మచ్చలు, నూనె రాసినట్లు మెరుస్తూ కొంచెం దళసరిగా ఉన్న చర్మం, చేతులు, పాదాలు నరాలు తిమ్మిర్లుగా అనిపించడం, కనుబొమ్మలు వెంట్రుకలు రాలిపోవడం వంటివి వ్యాధికి ముందస్తు సూచికలుగా గమనించాలని చెప్పారు.

నిబంధనల ప్రకారమే రోడ్డు విస్తరణ

పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

పిడుగురాళ్ల: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే రోడ్డు విస్తరణ పనులు చేపడతామని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. సుబ్బారావు మాట్లాడుతూ పట్టణాన్ని సుందరంగా, ప్రజలకు సౌకర్యవంతంగా తీర్చిదిద్ది భావితరాలకు ఆదర్శంగా నిలుద్దామన్నారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదేశాలతో పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్డు విస్తరణ చేస్తున్నామని చెప్పారు. పట్టణంలోని పలు దుకాణాలు కొంత భాగం తొలగింపునకు సహకరిస్తామని పలువురు వ్యాపార పెద్దలు గతంలో తెలిపారని వివరించారు. వ్యాపారులు ఎవరూ ఇబ్బంది పడకూడదని ఎమ్మెల్యే రోడ్డు విస్తరణను కుదించారని వెల్లడించారు. అయినా కొందరు వ్యాపారులు కోర్టును ఆశ్రయించారని చెప్పారు. కోర్టు నిబంధనల మేరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సూచించిందని, నిబంధనల ప్రకారం రోడ్డు విస్తరణను 12.8 మీటర్ల మేర విస్తరించాల్సి ఉంటుందని వివరించారు. దీనికి అనుగుణంగా సుమారు 74 మంది షాపు యజమానులకు మొదటి దఫా నోటీసులు ఇచ్చామని, అయినా షాపుల యజమానులు దుకాణాల ముందు ఉన్న మెట్లు కూడా తొలగించ లేదని పేర్కొన్నారు. వ్యాపారులకు రెండో సారి నోటీసులు ఇచ్చేందుకు మున్సిపల్ అధికారులు సిద్ధమయ్యారని వెల్లడించారు. రోడ్డు విస్తరణను కౌన్సిల్ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు దుకాణ యజమానులు సహకరించాలని కోరారు. నిబంధనల ప్రకారం.. భూమి కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇస్తామని వివరించారు. కౌన్సిలర్లు కత్తెరపు వాసుదేవరెడ్డి, తురకా ముక్కంటి, కొక్కెర కొండలు, మాదాల కిరణ్‌కుమార్, జూలకంటి శ్రీరంగ రజనీ, షేక్ సైదావలి, అప్పిరెడ్డి, ఆనంద్‌బాబుతోపాటు పలువురు స్థానిక సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. వీటిని పరిష్కరిస్తామని కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు, డీఈ సత్యానారాయణ చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పొలంబడితో రైతులకు విజ్ఞానం


గుండ్లపల్లి గ్రామంలోని రైతులకు అవగాహన కల్పిస్తున్న పల్నాడు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళి, పలువురు అధికారులు

నకరికల్లు: డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం రైతుల్లో విజ్ఞానాన్ని పెంచి తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు దోహదపడుతోందని పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి చెప్పారు. మండలంలోని గుండ్లపల్లి, నర్సింగపాడు గ్రామాల్లో మంగళవారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. గ్రామసభలు, వరిలో వివిధ దశల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, మానవునిపై పురుగుమందుల ప్రభావం, విత్తనశుద్ధి, విత్తన మొలకశాతం, నీటినిలువ సామర్థ్యం, వేరుదారుల ప్రయోగం తదితర అంశాలపై ప్రదర్శనలు నిర్వహించి రైతులకు కళ్లకు కట్టినట్లు వివరించారు. డీడీఏ శివకుమారి, కమిషనర్ కార్యాలయం వ్యవసాయాధికారి ఉషారాణి, జిల్లా వ్యవసాయ కార్యాలయం వ్యవసాయాధికారి సుజాత, పల్నాడు జిల్లా పొలంబడి మానిటరింగ్ అధికారి వై.హనుమంతరావు, క్రోసూరు, పిడుగురాళ్ల ఏడీఏలు బి.శ్రీకృష్ణదేవరాయలు పొలంబడి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, రైతులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. లక్ష్మీనరసింహుని కల్యాణం


స్వామి కల్యాణ తంతును నిర్వహిస్తున్న పూజారులు

మాచవరం: మోర్జంపాడు గ్రామంలో శ్రీలక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం నేత్రపర్వంగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు కల్యాణ ఘట్టాన్ని కన్నులారా తిలకించారు. దంపతులు పీటలపై కూర్చొని ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు వేద మంత్రోచ్చరణలతో మంగళ సూత్రధారణ చేపట్టారు. ఆలయ పూజారులు స్వామి కల్యాణ విశిష్టతను తెలియజేశారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భారీగా వచ్చిన భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందించారు. వారికి ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు. కల్యాణ మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు స్థానిక జెడ్పీ హైస్కూల్లో శ్రీలక్ష్మీనరసింహస్వామి రైతుసేవా సంఘం ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 20 వేల మంది అన్న ప్రసాదం స్వీకరించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి ఎద్ల పందేలు

జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల బల ప్రదర్శన పోటీలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జత పండ్ల విభాగంలో పోటీలు ఉంటాయని, గెలుపొందిన జతలకు రూ.20వేలు, 15 వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.4వేలు నగదు బహుమతులు ఉంటాయని వివరించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ, ఒకరి మృతి


సుబ్బయ్య మృతదేహం

అచ్చంపేట: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని మాదిపాడుకు సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. చల్లగరిగ గ్రామానికి చెందిన దోగిపర్తి సుబ్బయ్య(62) రాత్రి 9.30 గంటల సమయంలో బైక్‌పై మాదిపాడు నుంచి స్వగ్రామమైన చల్లగరిగ వస్తుండగా అచ్చంపేట నుంచి మాదిపాడుకు వెళ్తున్న మరో బైకు ఢీకొట్టింది. దోగిపర్తి సుబ్బయ్యకు తీవ్రగాయాలై అధిక రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో సత్తెనపల్లి వైద్యశాలకు తరలించారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


ప్రభుత్వ పథకాల బ్రోచర్లను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

మాచవరం: గురజాల నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండో రోజు నిర్వహించారు. బీసీ, ముస్లిం కాలనీలు, గాంధీనగర్ ప్రాంతాల్లో గడప గడపకు వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని కాసు వివరించారు. ప్రభుత్వం ముద్రించిన బ్రోచర్లను అందించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ప్రతిభ ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. ఎలాంటి సిఫార్సులు లేకుండా ప్రభుత్వ పథకాలు నేరుగా అర్హులకు చేరుతున్నాయన్నారు. ఎక్కడా అవినీతికి తావులేదన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ద్వారా కొత్త పాలన మొదలైందన్నారు. గ్రామంలో నూరు శాతం సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేసి నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. అవసరమైన చోట్ల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు మంజూరయ్యేలా చూస్తానన్నారు. సచివాలయ కన్వీనర్లు కొంత మంది వలంటీర్లను దత్తత తీసుకొని, వారి ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ పాలన, నవరత్నాల అమలు, పలు అంశాలతోపాటు ప్రజల సమస్యల పరిష్కారంపై సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. గత టీడీపీ పాలనా లోపాలను ప్రజలకు వివరిస్తూ, నేడు గడప గడపకూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు, నవరత్నాల అమలును ప్రజలకు తెలియజేయాలన్నారు. నాడు -నేడు అభివృద్ధి కార్యక్రమాల ద్వారా గ్రామంలో వచ్చిన మార్పును క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇప్పటికే దేశంలోని పలు రాష్ట్రాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఆదర్శంగా తీసుకొని అమలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సింగరయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి , వైస్ ఎంపీపీలు చింతపల్లి నన్నే, స్థానిక సర్పంచ్ ముండ్లపాటి పుల్లమ్మ, ఎంపీటీసీ సత్యన్నారాయణ, యార్డు వైస్ చైర్మన్ వంకాయల రమేష్, యార్డు డైరెక్టర్ రాము, గ్రామ నాయకులు మండ్లపాటి ఆంజినేయులు, చిన రామాంజినేయులు, ముకుందరావు, సచివాలయ కన్వీనర్ సాంబశివరావు, అబ్దుల్లా, గొల్లపల్లి వెంకటేష్, పోతిపోగు ఆదాం, మాజీ ఎంపీటీసీ సుబ్బారావు, మాజీ సర్పంచ్ వీరయ్య, మస్తాన్‌వలి, దస్తగిరి, ఎంపీడీఓ వై.రాజగోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి, ఈఓఆర్డీ వెంగళరావు,విద్యుత్ శాఖ ఏఈ పెదమస్తాన్, మండల నాయకులు షైదా, జానీ,సురేష్, పుల్లారెడ్డి, స్థానిక నాయకులు, పలు శాఖల ప్రభుత్వ అధికారులు,వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలు

రెంటచింతల: ప్రతి ఒక్క విద్యార్థీ ఆత్మ విశ్వాసంతో కృషిచేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని ప్రముఖ సైకాలజిస్ట్ ప్రత్యూషాసుబ్బారావు చెప్పారు. మంగళవారం స్థానిక ఎస్సీ బాలికల సంక్షేమ వసతిగృహంలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్ తరగతులలో ఆయన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విశ్వాసం కోల్పోకుండా నమ్మకంగా పనిని తలపెట్టినప్పుడు ఆ పని తప్పక విజయవంతం అవుతుందని చెప్పారు. తీవ్రమైన కోరిక, సాధించాలనే ఆకాంక్ష ఉన్నప్పుడు లక్ష్యాన్ని చేరుకుంటారని పేర్కొన్నారు. మనిషి మనస్సులో వినయం ఎంత ఎదిగితే జీవితంలో ఆ మనిషి అంత ఎదుగుతాడని దాదా సాహెబ్ డాక్టర్ అంబేడ్కర్, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం వంటి పలువురు ప్రముఖ వ్యక్తుల జీవితాలను ఉదాహరణగా వివరించారు. ఎంపీపీ దాసరి చౌడేశ్వరి మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ సముద్ర కెరటాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. దేశ భవిష్యత్ తరగతి గదులలోనే నిర్మితమవుతుందనే విషయాన్ని విద్యార్థులతోపాటు తల్లిదండ్రులూ గమనించినప్పుడే మంచి పౌరులతో కూడిన సమాజం ఏర్పడుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బలహీన వర్గాల విద్యార్థుల విద్యాభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూ టీవీ సుజాత, స్టెప్ అధ్యక్షులు ఆళ్ళ అనంతరాము, జిల్లా ఎస్సీ మానిటరింగ్ సభ్యులు పి.పౌలేసు, సంక్షేమ వసతి గృహాల వార్డెన్లు నూరెల్లా బేగ్, జే.అరుణకుమారి, పి.సుమని తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం కలిగి ఉండాలి

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి


సన్మానిస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి : ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి చెప్పారు. సమాజసేవ చేస్తున్న ది మదర్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకురాలు నాగేండ్ల సుమతీరత్నం, ప్రగతి సేవా సొసైటి వ్యవస్థాపక అధ్యక్షుడు చెట్టిపోగు రాజ్‌కమల్‌తోపాటు ఇటీవల తెలుగులో ఏఎన్‌యూ గోల్డ్‌మెడల్ సాధించిన ఎ.జె.ప్రకాశినిని పల్నాడు ఐక్యవేదిక ఆధ్వర్యంలో గామాలపాడులో ఎమ్మెల్సీ జంగా చేతుల మీదుగా సోమవారం రాత్రి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జంగా మాట్లాడుతూ.. మనిషిగా భూమిమీద బతికే ఉన్నతకాలం ఇతరులకు సాయం చేసేలా జీవించాలని, ఆపదలో ఉన్న వ్యక్తులకు సాయం చేయటం అనేది గొప్ప అదృష్టంగా భావించాలని పేర్కొన్నారు. ఒక ప్రభుత్వంతోపాటుగా స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాయని, భవిష్యత్‌లో మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మన్ననలను పొందాలని కృష్ణమూర్తి సూచించారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల జెడ్పీటీసీ సభ్యులు జంగా వెంకటకోటయ్య, సర్పంచ్ జంగా సురేష్, మాజీ ఎంపీపీ అంబటి శేషగిరిరావు, ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి షేక్ షరీప్, ఎంపీటీసీలు ఆకూరి కాశీరెడ్డి, షేక్ ఆదాంసాహెబ్, కార్మిక విభాగం పార్లమెంట్ అధ్యక్షుడు గద్దల వేదమణి, మాజీ జెడ్పీటీసీ భూషణం చెన్నయ్య, నాయకులు మందా బెంజిమెన్, ఏసోబు, నెల్లూరి రామస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పశు సంపద రక్షణకు చర్యలు


ఆవులకు వ్యాక్సిన్ ఇస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులు

దుర్గి: పశు సంపద రక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని పశు సంవర్ధక శాఖ ఏడీ బి.జగదీష్‌బాబు చెప్పారు. పశు సంవర్ధక శాఖ పక్షోత్సవాల సందర్భంగా మంగళవారం శ్రీ నిదానంపాటి అమ్మవారి ఆలయంలోని శ్రీలక్ష్మీ గోకుల సదన్‌లో ఆవుల సంరక్షణకు చేపట్టవలసిన కార్యక్రమాలను ఆయన వివరించారు. గోశాలలోని గోవులకు గొంతువాపు, గాలి కుంటూ వంటి వివిధ వ్యాధులు ప్రబలకుండా వ్యాక్సిన్ ఇచ్చారు. స్థానిక ఆలయ అధికారి శ్రీగిరిరాజు నరసింహబాబు మాట్లాడుతూ నోరులేని జీవాలు పట్ల ప్రతిఒక్కరూ బాధ్యతగా మెలగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మమ్ము శివరాం, దుర్గి పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి దిలీప్ కుమార్, ఏహెచ్‌ఎల్ఏ ఆర్. శ్రీనివాసరావు, వీఎల్ఓ పి.మరియబాబము, ఏహెచ్‌ఎల్‌డీ రామకృష్ణ, ఆర్.నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు అడిగొప్పలలో గడప గడపకు మన ప్రభుత్వం


అడిగొప్పలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం అడిగొప్పల గ్రామంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరై ప్రతి గడపకు వెళ్ళి ప్రజా సమస్యలు తెలుసుకొని ప్రభుత్వం నుంచి పొందిన సహాయాన్ని వివరించనున్నట్లు వెల్లడించారు. మంగళవారం అడిగొప్పలలో ఏర్పాట్లను ప్రజాప్రతినిధులు పరిశీలించారు.